Please visit www.dhimsa.net



కథనం

# అటవీ హక్కుల గుర్తింపులో చెంచులకు అన్యాయం

గంజివరపు శ్రీనివాస్



నల్లమల అడవుల్లోని నాగార్జున - శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రం ఆసియా లోనే పెద్ద పులుల రక్షిత ప్రాంతం. దీన్ని రాజీవ్‌గాంధీ పులుల రక్షిత ప్రాంతంగా కూడా పిలుస్తారు. ఆదివాసీతెగల్లో ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబాటు తనంతో బతుకుతున్న చెంచుతెగ గిరిజను లకూ ఈ పులుల సంరక్షణ కేంద్రమే ప్రధాన ఆవాసం. చెంచు తెగ గిరిజనానికి నేడు పులుల రూపంలో ముప్పు ముంచు కొచ్చింది. అటవీ శాఖ చెప్పే లెక్కల స్థాయిలో అసలు అన్ని ఉన్నాయో లేవో తెలీని పులుల సంరక్షణ పేరిట నల్లమలలో చెంచుల బతుకు చిత్రాన్ని అధికార్లు చిత్ర విచిత్రంగా ఛిద్రం చేస్తున్నారు. వారి అభివృద్ధికి మేమున్నా మంటూ భరోసా ఇవ్వాల్సిన గిరిజన సంక్షేమశాఖ అధికార్లు మొద్దు నిద్ర వీడడంలేదు. అడవి.. దాంట్లో జంతువులు తప్ప అక్కడి గిరిజనం గోడు పట్టని అటవీ సిబ్బంది అక్కడి నుంచి చెంచులను తరిమేందుకు శతాధా ప్రయత్నిస్తున్నారు. గిరిజన తెగలకు జరుగుతున్న చారిత్రాత్మక అన్యాయాన్ని సరిదిద్దేందుకు దేశవ్యాప్తంగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమల్లోకి వచ్చి రెండేళ్లు గడిచి పోతుంది. నల్లమలలోని చెంచుగూడే ల్లోని గిరిజనులకు వారి సాగులోని అటవీ భూములకు, అటవీ వనరులపై ఆధిపత్యం హక్కులు కల్పించడానికి జరుగుతున్న ప్రక్రియ ప్రహసనంగా మారింది. మరోపక్కతగ్గి పోతున్న పులుల సంతతిని పెంచి తద్వారా పర్యావరణ సమతుల్యాన్ని పాటించేందుకు ఉద్దేశించిన విధానాలు దేశవ్యాప్తంగా అమలు చేయడానికి రంగం సిద్ధమైంది. ఈ విధానాల అమలుతో శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రంలో వున్న చెంచు గిరిజనులను వారి ప్రాంతాలనుంచి బయటకు తరలించాలి. ముందుగా అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని మొక్కుబడిగా అమలు చేసేసి ఆ తర్వాత చెంచులను పులుల సంరక్షణ కేంద్రం నుంచి బయటకు తరలించే ప్రక్రియను అమలు చేయాలని అధికార్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడి చెంచుల సమస్యలను, వారిమనోగతాన్ని, వారికిఅడవితోను, పరిసరాల తోనూ వున్న అనుబంధాన్ని పరిగణనలోకి తీసుకునే ప్రయత్నాలు జరగడంలేదు.

నల్లమల అడవుల పరిధిలోని మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్గొండ జిల్లాలో 3568 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజీవ్‌గాంధీ టైగర్ రిజర్వు (పులుల రక్షిత ప్రాంతం) విస్తరించి వుంది. రక్షిత ప్రాంతం పరిధిలో 200 వరకూ గ్రామాలున్నాయి. సరిహద్దుల్లోనే 120కి పైగా గ్రామాలు ఉన్నాయి. తొలుత 1972లో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి అభయారణ్యంగా ప్రకటించారు. 1983లో దీనిని 'పులుల రక్షితప్రాంతం'లో ఒకటిగా గుర్తించారు. రక్షిత ప్రాంత కోర్ ఏరియలో 24 గ్రామాల పరిధిలో 1500 కుటుంబాలకు చెందిన 5వేల జనాభా వున్నట్టు అంచనా. ఈ జనాభా గణాంకాల్లో కూడా అటవీ, ఐటిడిఏల మధ్య ఎంతో తేడా కనిపిస్తుంది. వీరంతా చెంచుతెగకు చెందిన గిరిజనులే. బఫర్ జోన్ పరిధిలో 50 వేల పైబడి జనాభా, రక్షిత ప్రాంత సరిహద్దు 80 గ్రామాల్లో 1లక్షా 30 వేల జనాభా నివసిస్తున్నారు. 1990లో ఈ రక్షిత ప్రాంతం లో 100 పెద్ద పులులు వుండేవని అటవీ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ విధానాలు, తీవ్రవాదం పెచ్చరిల్లడం, అక్రమవేట,

అటవీ, వన్యప్రాణి సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టక పోవడం వంటి కారణాల మూలంగా ఈ పులల రక్షిత ప్రాంతంలో అడవులు ఘోరంగా క్షీణించాయి. అడవుల క్షీణతతో పాటే పులుల సంతతి కూడా గణ నీయంగా తగ్గిపోయింది. అటవీ శాఖ లెక్కల ప్రకారం 1994లో 34కు తగ్గిపోయిన పులుల సంఖ్య నేడు70కుపైగాపెరిగిందని చెబుతు న్నారు. ఈ లెక్కలపై విశ్వసనీయత లేదు. పులుల సంఖ్య పెరిగిందని చెబుతున్న ఈ మధ్య కాలంలోనే పులుల రక్షిత ప్రాంతంలో మావోయిస్టులు తమకార్యకలా పాలను బాగా

## పశువుల చొరబాటుతో వన్యప్రాణులకు కష్టకాలం

## పెద్దపులులతో ముప్పు తక్కువే ! ఎలుగు దాడులే ఎక్కువ



శ్రీశైలం పులుల రక్షిత ప్రాంతంలోకి మేతకోసం చొచ్చు కొచ్చే పశుసంపద అటవీశాఖకు ఇబ్బందికరంగా పరిణమించింది. అడపాదడపా రక్షిత ప్రాంతంలోని చెంచులపై జరిగే వన్యప్రాణుల దాడులు మూలంగా ఘర్షణ వాతావరణం ఇక్కడ సర్వసాధారణం. విచిత్రమేమిటంటే పెద్దపులు లతో సామాన్య చెంచులకు పెద్దగా హానిలే నట్టు గణాంకాలు చెబుతున్నాయి.' పెద్దపులి మా అన్నయ్య సారు ! అవీ మేము ఒకదగ్గరే పుట్టాం..కలిసే పెరిగాం. పులి మమ్మల్నేం చేయడు..మమ్మల్ని చూసినా అటే మెల్లగా వెళ్లిపోతాడు' అంటూ కోర్ ఏరియా లోని అప్పాపూర్ ఊరిపెద్ద తోకల మల్లయ్య చెప్పిన మాటలు నాటకీయంగా అనిపించినా తరచి చూస్తే అందులో నిజంలేకపోలేద నిపిస్తుంది. నల్లమలపరిధి గ్రామాలలోని పశువులు దాదాపుగా అడవిలోనే మేతకు వెళతాయి. అటవీశాఖ అంచనాల ప్రకారం కోర్ ఏరియా పరిధిలోని 24 గ్రామాల్లో 15వేల వరకూ పశువులు వున్నాయి. ఏటా వీటి సంఖ్య 400 చొప్పున పెరిగిపోతుంది. బఫర్, సరిహద్దు ప్రాంతాల్లో 43వేల 350 వరకూ పశుసంపద వుంది. ఇంకా బయట మైదాన ప్రాంతాలనుంచి కేవలం మేత కోసం 3 లక్షల మేర పశువులు పులుల రక్షిత ప్రాం తంలో చొరబడుతున్నాయి. ముఖ్యంగా వేసవికాలంలో పశుగ్రాసం లభించకపోవడం తో మేత మేసుకుంటూ అటవీలోతట్టు ప్రాంతాల్లోకి వెళతాయి. ఆ ప్రాంతంలోనే దాడులు ఎక్కువగా జరుగుతాయి. నల్లమ లలో సెలయేర్లు, నీటి గుంటలు వన్యప్రాణులకు సరిపడా లేకపోవడంతో లేవనే వాదన వుంది. అడవుల క్షీణతే దీనికి కారణం. తాగునీటికోసం పశువులు కూడా అదే వనరులపై ఆధారపడి వెళ్తుండడంతో అక్కడే ఎక్కువడా దాడులు జరిగే అవకాశం ఏర్పడుతుంది. బయటి నుంచి అధికసంఖ్యలో పులుల రక్షిత ప్రాంతంలోకి మేతకోసం వచ్చే పశువుల వల్ల వాటి ప్రాణాలకు ముప్పు పొంచి వుండగా, పరోక్షంగా వన్య ప్రాణి మనుగడ కూడా ప్రమాదంలో పడుతుందని అటవీ వర్గాలు చెబుతున్నాయి. పశువులు పగటి వేళల్లో వన్యప్రాణులు ఆధారపడే నీటిచెలమల్లో నీటిని వినియోగిం చడం వల్ల రాత్రివేళల్లో నీటికోసం వచ్చే వన్యప్రాణులకు నీటికొరత ఏర్పడుతుంది. అలాగే నీటి కుంటల్లో సంచరించే పశువుల వల్ల వన్యప్రాణులకు అంటురోగాలు వ్యాప్తి చెందుతున్నాయని అచ్చంపేట డి.ఎఫ్.ఓ. శంకరన్ చెప్పారు. అటవీశాఖ లెక్కల ప్రకారం 2007-08, 2008-09లో ఇప్పటివరకు అడవి జంతువులను వేటాడి, మాంసం పట్టుకున్న కేసులు 21 మాత్రమే. వారి నుండి సీ ఫీజ్ కింద వసూలు చేసింది 2007-08లో రూ.30,000., 2008-09లో 10 కేసులకుగాను 9 కేసుల్లో రూ.1,15,000 వసూలు చేశారు. వన్యమృగాల దాడిలో2007-08లో135, 2008-09 175 పశువులు మరణించాయి. దీనికి పరిహారంగా అటవీశాఖ ఇప్పటివరకు రూ.1,97,200లు బాధితులకు చెల్లించింది. పశువులపై దాడిని నిర్ధారించటానికి బీట్, సెక్షన్, రేంజర్ల తోపాటు స్థానిక విఆర్ఓలు పంచనామా చేస్తారు. అప్పుడే పశువుకు పరిహారం నిర్ధారిస్తారు. అయితే బయటి మార్కెట్లో చనిపోయిన పశువు విలువ ఎంతుందో అంతే చెల్లిస్తామని అటవీఅధికారులు చెబుతున్నారు. అటవీశాఖ లెక్కల ప్రకారం నల్లమలలో పెద్దపులులు 70 వరకూ ఉన్నాయని అంచనా. అయితే వాటినుంచి మనుష్యులకు వాటిల్లిన ముప్పేమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఎక్కువగా 2007-08. 2008-09లో 8 మందిపై ఎలుగుడంటి దాడిచేస్తున్నట్టు అధికార్లు చెబుతున్నారు. గడిచిన రెండేళ్లలో ఎలుగు బంటి దాడిలో కొండనాగులకు చెందిన ఉస్సేన్, అప్పాయిపల్లికి చెందిన నిమ్మల దేవేంద్రమ్మ, మండ్లి పెద్దయ్య, పదర శేఖర్, కొల్లంపెంట పెద్ద జహంగీర్, చిన్న జహం గీర్, చింతపల్లి బాలునాయక్, అప్పాపూర్కు చెందిన తోకల ఈదయ్య, గురువయ్య, బికె తిర్మలాపూర్ రామావత్ జోగ్యలు గాయపడగా చిరుత దాడిలో యస్.దేవ్లా, డి.లక్ష్మీ, బీజాలు గాయపడ్డారు. అడవిజంతువుల వేటలో భాగంగా నీరు దొరక్క అడవిని వీడి గ్రామాల వైపు రావడంతో దాడులు జరుగుతున్నాయి. దాడుల్లో గాయపడిన వారికి నష్టపరిహారంగా సుమారు రూ. ఆరు లక్షల వరకు చెల్లించి నట్టు అటవీ వర్గాలు తెలిపాయి.

విస్తరించారు. అటవీశాఖ సిబ్బంది కంటే పోలీసుల పెత్తనం నల్లమలఅడవుల్లో ఎక్కువయింది. క్రమేణా అడవికి అటవీ శాఖ సిబ్బందికి దూరం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చెబుతున్న పులుల సంఖ్యపై విశ్వస నీయత కొరవడింది. దేశవ్యాప్త విధానంలో భాగా పులుల సంతతి తద్వారా అడవుల పెంచడం ద్వారా సమతుల్యత సాధించేందుకు నల్లమల అడవుల్లోని 1000 చదరపు కి.మీ.ల విస్తీర్ణంలోని కోర్ ఏరియాను క్రిటికల్ టైగర్ హేబిటేట్‌గా (కీలకమైన పులుల ఆవాస ప్రాంతం) ప్రకటించేందుకు పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతించింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితమే అమల్లోకి వచ్చిన షెడ్యూలు తెగల అటవీ హక్కుల గుర్తింపు చట్టం చెంచుతెగ గిరిజనుల్లో ఆశలను రేకెత్తించింది. తరచిచూస్తే ఈ చట్టం అమలుతో చెంచు తెగ గిరిజనుల బతుకుల్లో గొప్ప మార్పు ఆశించడం అత్యాశే అవు తుంది. చెంచుతెగ గిరిజనుల అవగాహనా రాహిత్యం, అటవీ, గిరిజనశాఖల మధ్య సమన్వయలోపం, రాష్ట్రస్థాయి అధికార్లకు ఇక్కడ పర్యవేక్షణ చేయాలనే ఆసక్తి కొరవ డడం, ఇతరత్రా అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమల్లో నెలకొన్న ప్రతిభంధకాలు వెరసి ఇక్కడ చెంచుల ఆశలపై నీళ్లు చల్లుతు న్నాయి. ఈ చట్టం అమలు ద్వారా చెంచులకు భూమిపై, వనరులపై హక్కులు కల్పించిన అనంతరం నిభందనల మేరకు వారిని ఒప్పించి, నష్టపరిహారం, పునరా వాసం కల్పిం చి టైగరు రిజర్వు నుంచి బయటకు తరలిస్తా మని నాగార్జున శ్రీశైలం టైగరు రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్, కన్జర్వేటర్ ఎ.కె.నాయక్ చెప్పారు.

### చట్టం ఎంతో ఘనం..అమలే అధ్వాన్నం.

ఆదివాసీలకు జరుగుతున్న చారిత్రాత్మక అన్యాయాన్ని సరిదిద్దాలనే

## చెంచులకు తిండిపెట్టే అడవితల్లి !


అటవీ ఉత్పత్తులు ఆరబెడుతున్న గిరిజనులు

చెంచులకు కడుపునిండా తిండిపెట్టేది అడవి తల్లే. అదే వారి బతుకు. చెంచులు అడవులలో లభించే గడ్డలు, పళ్ళు, కాయలనే కాకుండా ఆకులు, వేర్లు, పువ్వులను కూడా ఆహార పదార్ధాలుగా వినియోగిస్తారు. శ్రీశైలం టైగర్ రిజర్వులోని నల్లమల అడవుల్లో చెంచులు అనాదిగా ఈ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నా వారికి చట్టపరమైన హక్కు కల్పన లేదు. విరివిగా చెంచులు అటవీ ఉత్పత్తులు సేకరిస్తుండడం మూలంగా వన్యప్రాణులకు సహజంగా ఆహార పదార్ధాలకు కొరత ఏర్పడుతున్నదని అటవీ అధికార్లు చెబుతున్నారు. చెంచులు సేకరించే గడ్డల్లో ముఖ్యమైనవి చెంచు గడ్డ, పిల్లి పిసర గడ్డ, సంకుర గడ్డ, కొండ గడ్డ, ఎరవల గడ్డ, తేవర గడ్డ, బొడ్డి గడ్డ, చంద గడ్డ, భూచక్ర గడ్డ; ఆకు కూరల్లో పైలి కూర, సిరి కూర, దుగ్గల కూర, చెంచుల కూర, దేవ దారాకు, బలుసాకు, దొగ్గలి కూర ముఖ్యమైనవి చెంచులు తినే పళ్ళు; కలివి, ఎర్రబిక్క, జాన, దేవదారు, బలుసు, సార (మొర్లి), ముష్టి, రేగి, గొట్టి, మోవి, పాల, తెల్లపులికి, వెలగ, మారేడు, వేప, చింత, సీమ చింత, నేరేడు, ఉప్పి, తాండ్ర, బుట్ట, నక్కిరి, నెమ్మి, కూలి, ఈత, మేడి, మెర్లి, తుమికి, జువ్వి పూలలో ముఖ్యమైన ఇప్ప, వేప. గింజ లలో ప్రధానమైనవి కాశిగింజలు, మాడుపు గింజలు, బూరుగ గింజలు. ఇవి కాక, పుట్టగొ గులు (పుట్టగొడుగులు) మొదలైన వన్య శాకాహార పదార్ధాలు కనీసం వంద రకాలు న్నాయి. ఈ ఉత్పత్తుల కొరత ఏర్పడినపుడు చెంచులు, చింత పండును బూడిదలో (చింతనల్ల మద్ది) కలిపి, పిసికి తింటారు. ఎండిన బూరుగ గింజలను కూడా తింటారు. తేనె కూడా వీని ముఖ్యాహారం. రెండు, మూడు వర్షాలు పడ్డ తరవాత తేనె టీగలు కరవవు. ఎండా కాలంలో అవి పిల్లల్ని పెడతాయి. వర్షాకాలంలో పెద్దవై తేనె పెడతాయి. సిరిమాను బంక , తవిసిబం కలను కూడా ఆహారంగా వినియోగిస్తారు. ఉసుళ్ళు (వర్షాకాలపు రెక్కల పురుగులు) వారికి ఇష్టమైన మరో ఆహార పదార్థం. వర్షాకాలంలో నే పొగ పెట్టి ఉసుళ్ళను బయటికి రప్పింస్తారు. వాటిని వేపుకుని ఇష్టంగా తింటారు.

మహోన్నత లక్ష్యంతో అమల్లోకి వచ్చిన షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీ వాసుల(అటవీహక్కుల గుర్తింపు) చట్టం, 2006 ఆశించిన ప్రయోజనాన్ని చేకూర్చలేక పోతోంది. చట్టం అమల్లో ప్రభుత్వ వర్గాలు అంతులేని ఆలసత్వాన్ని ప్రదర్శిస్తున్నా యి.. వారిహక్కులను గుర్తించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయి. అడవులపై తమ సాంప్రదాయహక్కుల గుర్తింపునకు చట్టరూపం లభించే వరకూ ఆదివాసీలు, వారి అనుకూల వర్గాలూ ఎంతో ఉద్యమించాల్సి వచ్చింది. చట్ట రూపకల్పనకు ముందటిలానే అమల్లోకి వచ్చిన తరువాత కూడా తమ ఆశలకు వివాదాల ముసురు తరుము తూనే వుండడం ఆదివాసీలను ఎంతగానో భాదిస్తుంది. ఈచట్టం జనవరి 2007 లోనే రాష్ట్రపతి ఆమోదముద్ర వడి ప్రభుత్వ గజిట్‌లో ప్రచురణయింది. నియమ, నిబంధనలను రూపొందించేందుకు మరోఏడాదిపట్టింది. ఉన్నంత లోతమఅటవీభూములకు హక్కుపత్రం, తమ నేలపై నిశ్చింతగా అటవీ ఉత్పత్తులను సేకరించుకునే ధీమా తమకు వస్తే చాలని సంబర పడ్డ ఆదివాసీలకు చట్టం అమల్లో పాలకవర్గాల ప్రస్తుత వైఖరి అయోమయం కలిగిస్తుంది. చాలా రాష్ట్రాల్లో హడావుడిగా చట్టాన్ని అమలు చేసేయాలనే ఆత్రుత తప్పితే క్షేత్రస్థా యి పరిశీలన, పకడ్బందీ అమలు కోసం పటిష్టచర్యలు, పర్యవేక్షణపూర్తిగా కొరవడ్డాయి. చట్టంఅమలులో కీలక పాత్ర వహించాల్సిన అటవీసిబ్బంది సహాయ నిరాకరణతో హక్కుల కల్పన ముందుకుసాగే పరిస్థితికనిపించడం లేదు. తమ బతుకులకు భరోసా దొరు కుతుందు

# అడవిపై హక్కు సరే ! మాపై పాములను వదలొద్దు !


గిరిజన దంపతులు

అటవీ, ఐటిడిఏ అధికార్లు గిరిజన సంక్షేమం కోసం కంకణం కట్టుకున్నామని చెబుతుం టారు. కాని ఫర్హాబాదు అనే గ్రామానికి చెందిన తోకల ఈదయ్య అనే చెంచు గిరిజనుడిని కదిపితే వారి సేవలు ఎంత ఘనంగా వున్నాయో తెలుస్తుంది. ఐటిడిఏ అధికార్లు తమవైపు కన్నెత్తి చూడరని, అటవీ అధికార్లైతే తమను బయటకు తగిలేసేందుకు విషసర్పాలను గ్రామాల దగ్గర్లో వదులుతున్నా రని ఆందోళన చెందాడు. టైగరు రిజర్వు లోని కోర్ ఏరియాలోకి వచ్చే ఫర్హాబాదు చిన్న గ్రామం. ఆ గ్రామానికి వెళ్లాలంటే హైదరాబాదు - శ్రీశైలం రహదారిలోని టైగరు రిజర్వు ప్రధాన ద్వారం నుంచి పదిహేను కి.మీ.లు ప్రయాణించాలి. అక్కడ అటవీ శాఖ లెక్కల ప్రకారం 7 కుటుంబాలకు చెందిన 29 మంది జనాభా, ఐటిడిఏ లెక్కల ప్రకారం అదే ఏడు కుటుంబాలకు చెందిన 38 మంది జనాభా నివసిస్తున్నారు. ధింసా ప్రతినిధి ఇటీవల ఆగ్రామాన్ని సందర్శించడం జరిగింది. గ్రామానికి చెందిన తోకల ఈదయ్య కుటుంబం అక్కడే నివసిస్తుంది. ఈదయ్యను కదిపితే తమ గ్రామంలో 9 కుటుంబాల వారం నివసిస్తున్నామన్నాడు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం అనేది ఒకటి వుందని తనకు తెలియదని చెప్పాడు. గతంలో గ్రామానికి ఆనుకుని వున్న మూడెకరాల అటవీ భూమిలో భార్య ఆదమ్మతో కలిసి మొక్కజొన్నలు, రాగులు సాగుచేసుకునే వాళ్లమని చెప్పాడు. అటవీశాఖ సిబ్బంది తమ గ్రామాన్ని పట్టణానికి తరలిస్తున్నామని చెప్పారు. తప్పితే అటవీభూమికి సాగుహక్కు కల్పించే విషయం తమకు తెలియదని చెప్పాడు. ప్రస్తుతం అడవిలో దుంపలు తవ్వుకుని మన్ననూర్ వెళ్లి అమ్ముకుంటున్నామని, అలా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో బతుకు కష్టంగా వుందని చెప్పాడు. ఐటిడిఏ అధికార్లు తమ గురించి పట్టించుకోరని చెప్పాడు. ప్రభుత్వం కట్టించిన పక్కాగృహం నివాసయోగ్యంగా లేకపోవడం తో గుడెసెలోనే బతుకుతున్నట్టు చెప్పాడు. అయితే అటవీశాఖ సిబ్బంది ఇటీవలగా హైదరాబాదు నుంచి తీసుకొచ్చి తమ గ్రామాల సమీపంలో పెద్దపెద్ద పాములను వదులుతున్నారని చెప్పాడు. చీకటిపడితే సంచరించాలంటే భయంగా వుందన్నాడు. అటవీశాఖ సాకలేని విషసర్పాలను హైదరాబాదు నుంచి తీసుకొచ్చి రాత్రివేళల్లో ఇక్కడ వదులుతున్నారని చెప్పాడు. తమను టైగరు రిజర్వునుంచి బయటకు తరిమేందుకే ఈ తరహా భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. ఈ విషయమై అచ్చంపేట డి.ఎఫ్.ఓ.శంకరన్‌ను వివరణ కోరినపుడు సర్పాలను వదలడం మామూలేనని అవి అంత ప్రమాదరకమైనవి కావని చెప్పారు. ఇదే విషయాన్ని కోర్ ఏరియాలో బతుకుతున్న చెంచులకు వివరిస్తే వారిలో అంతగా ఆందోళన నెలకొనే అవకాశం వుండేది కాదు.



న్న గిరిజనాన్ని నేడ అభద్రతా భావం వెంటాడుతోంది. మిగతాగిరిజన హక్కుల చట్టాల మాదిరిగానే ఇదికూడా కాగితాల్లోనే వుండి పోతుందనే భయం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

## చెంచు ప్రాంతాల్లో మొక్కుబడి గ్రామ సభలు

గిరిజనులకు అటవీ హక్కుల కల్పనలో నిర్ణయాధికారాన్ని గ్రామసభలదేనని చట్టం పేర్కొంటుంది. ఐదవ షెడ్యూలు పరిధిలోని గిరిజన ప్రాంతాలకు సంబంధించి గిరిజన కుటుంబాల ఆవాసాన్ని గ్రామసభగా పేర్కొనాలి. పీసా చట్టం కూడా ఇదే చెబుతుంది. ఈ రకంగానే చట్టం అమలుకు కార్యాచరణ చేయాలని అన్ని స్థాయిల్లో ఆదివాసీలు, వారి అనుకూలురు డిమాండ్ చేసారు. సాగులో వున్న అటవీ భూమి, వనరులపై హక్కులను గుర్తించేందుకు 10 నుంచి 15 మంది సభ్యులతో కూడిన ఒక కమిటీని గ్రామసభ స్థాయిలో గ్రామస్తులే ఎన్నుకోవాలని చట్టం చెబుతుంది. ఈ చట్టం ద్వారాఅటవీ సాగుభూములకు పట్టాలివ్వడమే కాకుండా కీలకమైన చిన్నతరహా అటవీ ఉత్పత్తులపై అధికారాన్ని గ్రామసభ స్థాయిల్లో ఉమ్మడిగా గుర్తించాలి. ఈ వనరులను ఉమ్మడిగా పరిరక్షించు కుంటూ వినియోగించుకొనే యాజమాన్యం ఇవ్వాలి. గరిష్టంగా ప్రతీ గిరిజన కుటుంబం 10 ఎకరాల మేర తమ సాగులో వున్న అటవీ భూమికి హక్కు పత్రం పొందే అవకాశం వుంది. అయితే క్షేత్రస్థాయిలో అటవీ సిబ్బంది సహాయ నిరాకరణ చట్టం అమలుకు పెద్ద అడ్డంకిగా నిలిచింది. గత ఏడాది సెప్టెంబరులో కొంత మంది పదవీ విరమణ పొందిన అటవీ సిబ్బంది చట్టం అమలును వ్యతిరేకిస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో సమస్య మరింత జటిలంగా మారింది. హక్కుల గుర్తింపునకు అవసరమైన ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని న్యాయస్థానం తెగేసి చెప్పినా పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అయింది. చెంచుల ఆవాసం అయిన శ్రీశైలం టైగర్ రిజర్వు లాంటి క్లిష్టమైన అటవీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో హక్కుల కల్పన పకడ్బంధీగా చేసే ప్రయత్నం చేయలేదు. గ్రామస్తుల కనీస జోక్యం లేకుండా ఐటిడిఏ అధికార్లే పంచాయితీ పరిధుల్లో కమిటీలను ఏర్పాటు చేసేసారు. దీంతో క్లెయిమ్‌ల స్వీకరణ ప్రహసనంగా మారింది. శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలోని చెంచు పెంటలు దూరంగా విసిరేసినట్టు వుంటాయి. ఉదాహరణకు లింగాల పంచాయితీ లో వుండే 16 గ్రామాలకు ఒకేసారి గ్రామసభ నిర్వహించడం, చెంచుపెంటల గిరిజనన్నంతా ఒకేచోట కూర్చోబెట్టి వారి నుంచి క్లెయిములు స్వీకరించడం క్లిష్టమైన పని. చెంచు గిరిజనమంతా పగలంతా అడవిలోని అటవీ ఉత్పత్తుల సేకరణకోసం వెళ్తుంటారు. ఈ పరిస్థితుల్లో ఐటిడిఏ, అటవీ అధికార్లు నిర్వహించిన పంచాయితీస్థాయి గ్రామసభలవల్ల వాస్తవ సాగు లెక్కలు, అటవీ ఆధారితు లకిచ్చే హక్కుల విషయంలో అన్యాయం జరిగిందని శ్రీశైలం సమీపంలోని దోమలపెంట గ్రామా నికి చెందిన ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకుడు దేశ్యానాయక్ అభిప్రాయపడ్డారు. అటవీ, రెవిన్యూ సిబ్బంది కమిటీలతో కలిసి క్లెయిములు ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఎవరి చేతిలో ఎంత అటవీ భూమి సాగులో వుందీ నమోదు చేయాలి. ఈ తరహా చట్టంలో పొందు పరిచిన నిబంధనలన్నింటినీ క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలంటే అటవీ, రెవిన్యూ, గిరిజన శాఖల రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ క్షుణ్ణమైన రీతిలో శిక్షణ ఇవ్వాలి. కాని అటవీ, రెవిన్యూ, గిరిజన సంక్షేమ శాఖల మద్య సమన్వయ లోపంతో మొక్కు బడి శిక్షణతో సరిపెట్టారని గిరిజన సంఘం నాయకుల మరో ఆరోపణ. ఇంకా ఈ ప్రాంతంలో మావోయిస్టుల బూచి చూపించి ఐటిడిఏ, అటవీ అధికార్లు చెంచు గిరిజనులకు అటవీ హక్కుల చట్టంపై అవగాహన కలిగించే ప్రయత్నం చేయలేదని విమర్శలున్నాయి. నాగార్జున సాగర్ అటవీ సర్కిల్ పరిధిలో అటవీ ఆక్రమణలు 102 గ్రామాల్లో వుండగా కేవలం 19 సర్వే బృందాలను నియమించి కేవలం 8 గ్లోబల్ పొజిషన్ సిస్టమ్స్ మాత్రమే సమకూర్చారు. ఫలితంగా సర్వే, సాగు భూములు గుర్తింపు మొక్కుబడిగా సాగిందని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీరామ్‌నాయక్ ఆరోపించారు.

## భూమి కంటే వనరులపై హక్కులే కీలకం

అటవీ హక్కుల గుర్తింపు చట్టంప్రకారం 2005 డిసెంబరు నాటికి దేశ వ్యాప్తంగా గిరిజనుల ఆధీనంలో వున్న అటవీ భూములపై గిరిజనులకు హక్కు పట్టాలు పంపిణీ చేయాలి. ఇంకా 49 రకాల కలపేతర అటవీ ఉత్పత్తుల సేక

గణాంకాలు : అటవీశాఖ, నాగార్జున సాగర్ సర్కిల్

| | | | | అటవీప్రాంత గ్రామపంచాయతీలలో ఉన్న గ్రామసభల పరిస్థితి | | | వ్యక్తిగత క్లయిములు | కమ్యూనిటీ క్లయిములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వ.నెం. | జిల్లా/డివిజన్ పేరు | అటవీప్రాంతంలో ఉన్న గ్రామ పంచాయతీల సంఖ్య | సాగులో వున్న అటవీ భూమి (ఎకరాలలో) | గ్రామ సభల సంఖ్య | ఎఫ్.ఆర్.సి.ల సంఖ్య | లబ్దిదారుల సంఖ్య | విస్తీర్ణం (ఎకరాలలో) | లబ్దిదారుల సంఖ్య | విస్తీర్ణం (ఎకరాలలో) |
| 1 | కర్నూలు/ఆత్మకూరు | 13 | 1252 | 23 | 23 | 325 | 4085 | 0 | 0 |
| 2. | ప్రకాశం/మార్కాపూర్ | 14 | 2617.28 | 14 | 14 | 3336 | To be surveyed | 13 | 2.5 |
| 3. | ఎమ్.బి.నగర్/అచ్చంపేట | 34 | 3082 | 34 | 34 | 1972 | 6553 | 0 | 0 |
| 4. | నల్గొండ/ఎన్.సాగర్ | 23 | 6633 | 23 | 23 | 4363 | 11996.2 | 0 | 0 |
| 5 | గుంటూరు/ఎన్.సాగర్ | 18 | 4930 | 18 | 18 | 2453 | 6548.84 | 0 | 0 |
| | ఎన్.సాగర్ మొత్తం | 41 | 11563 | 41 | 41 | 6816 | 18545.04 | 0 | 0 |
| | **మొత్తం** | **102** | **18514.28** | **112** | **112** | **12449** | **29183.04** | **13** | **2.5** |

రణపై కూడా పూర్తి హక్కులు గిరిజనులకే చెందేలా గుర్తింపు నివ్వాలి. చెంచుల విషయంలో భూమిహక్కుల కల్పనకంటే కలపేతర అటవీఉత్పత్తుల హక్కులు కల్పించడం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే చెంచు తెగ గిరిజనులు వ్యవసాయంకంటే వేట, అటవీఉత్పత్తులను సేకరించడమే ముఖ్యజీవనాధారంగా బతుకుతారు. వీరిలో ఎక్కువ మందికి వ్యవసాయం చేయుట తెలియదు. కొంతమంది మాత్రం చిన్న చిన్న భూములలో జొన్నలు సాగుచేస్తుంటారు. అడవిలో సేకరించిన తేనె, బంక, కరక్కాయి, కుంకుడు కాయ, మారేడు, గడ్డ లాంటి అటవీ ఉత్పత్తులను సేకరించి దగ్గరలో ఉన్న జి.సి.సి.లో 15 రోజులకొకసారి వాటిని విక్రయించి వారికి కావలసిన ఆహార పదార్థాలను తీసుకొంటారు. కొంతమంది ఆవులను, మేకలను కూడా పెంచుతుంటారు. నల్లమల అడవులను పులుల సంరక్షణ కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించడంతో ఇక్కడ వేట నిషేదించబడింది. దీంతో చిన్న చిన్న పక్షులను, అడవికోళ్లను, అడవి పందులను, కుందేళ్ళను బాణము, అంబుల తో వేటాడుతూ జీవిస్తున్నారు. ఈ వేటను వారి ఆహారానికి మాత్రమే తప్ప అమ్మడం చేయరు. చెంచులు అడవి నుండి తెచ్చిన ఉత్పత్తులను 90% జి.సి.సికే అమ్ముతుంటారు. జి.సి.సి.కే అమ్మాలనే నిబంధన కూడా ఉంది. కొత్తగా అమలు చేస్తున్న అటవీ చట్టం ప్రకారం కలపేతర అటవీ ఉత్పత్తుల న్నింటిపైనా చెంచుగిరి జనానికి హక్కులు కల్పించాలి. కాని ఈ హక్కులకు అవసంామైన క్లైయిము లను కూడా స్వీకరించడంలేదు. అవగాహన కరువ వడంతో క్లైయిము దరఖాస్తులు చేసుకోవడం లేదు. అటవీ హక్కుల గుర్తింపులో మొత్తం ప్రక్రియను సర్కిల్ పరిధిలో ఐదుజిల్లాలను ఒక యూనిట్గా, ఐటిడిఏ అధికార్లు మొత్తం ఆరు జిల్లాలను ఒక యూనిట్గా పరిగణిస్తున్నారు. తప్పితే ప్రత్యేకంగా టైగర్ రిజర్వును యూనిట్ పరిగణించకపోవడంతో చెంచు గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుంది. కోర్టు వివాదాల మూలంగా ఒక్కరికీ హక్కును గుర్తిస్తూ పట్టా ఇవ్వక పోయినా శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలోని చెంచులకు శాశ్వతంగా తమ అడవి, వనరులపై హక్కుల కల్పన కేవలం కల్పనగానే మిగిలిపోయే పరిస్థితి వుంది. టైగర్ రిజర్వు పరిధిలో ఇప్పటికే హక్కుల గుర్తింపునకు జరిగిన ప్రక్రియను రాష్ట్ర స్థాయి అధికార్లు సమీక్షించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం ద్వారా చెంచులకు న్యాయం చేసేందుకు కు ప్రయత్నించాల్సిన అవసరం వుంది.

వ్యాసకర్త సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ సంస్థ, న్యూఢిల్లీమీడియాఫెలోషిప్ - 2009 కింద ఈవ్యాసం వ్రాయడం జరిగింది ✷

**థింసా**

సంవత్సర చందా

కేవలం రూ.50/-లే వెంటనే

మనియార్డర్ చేయండి...

**-: చిరునామా :-**

**థింసా కార్యాలయం**

డోర్ నెం: 10-123, ఫ్లాట్ నెం: 154,

విశాలాక్షీ నగర్, విశాఖపట్నం-43

ఫ్యాక్స్ నెం: 0891 2737662

సెల్ నెం: 97053 47489